# హ్యాట్రిక్ విజయం మనదే



పెగడపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఓరుగంటి రమణారావు

- బీఆర్ఎస్‌కు 100 సీట్లు పక్కా
- మచ్చలేని నాయకుడు కొప్పుల ఈశ్వర్
- 70 వేల మెజార్టీతో విజయం తథ్యం
- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్
- పెగడపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

పెగడపల్లి, అక్టోబర్ 16: బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో అభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తున్నదని, సీఎం కేసీఆర్ సారథ్యంలో అమలు చేస్తున్న పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని, 100 సీట్లలో గెలిచి కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని దీమా వ్యక్తం చేశారు. సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో గొప్పవారని, తెలంగాణ పునర్నిర్మాణంలో నిస్వార్థంగా పని చేశారని వివరించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో అద్భుతమని, దేశంలో ఏ నాయకుడు ఇలా ప్రజల కోసం పనిచేయడని పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మచ్చలేని నాయకుడని, ధర్మపురి రారాజుగా ఈశ్వర్‌ను స్వయాన మంత్రి కేటీఆర్ అభివర్ణించారని, అలాంటి నాయకుడు దొరకడం ప్రజల అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో 70 వేల ఓట్ల మెజార్టీతో ఈశ్వర్ ఘన విజయం సాధిస్తారని దీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పటిష్టత, గెలుపు కోసం అందరూ సమన్వయంతో పని చేయాలని సూచిస్తూ, పార్టీ శ్రేణులతో ప్రమాణం చేయించారు.

### సమన్వయంతో పనిచేయాలి: జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

బీఆర్ఎస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని శ్రేణులకు సూచించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసిందని, గ్యాస్ సిలిండర్ ధర పెంచి సామాన్యుల నడ్డివిరిచిందని దుయ్యబట్టారు. ఒక్క అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు అడుగుతున్నారని, నాడు ఏండ్లకొద్ది అధికారంలో ఉన్నది వారే కదా..? అని చెప్పిన ఆమె, అప్పుడు పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? అంటూ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ పార్టీ రాష్ట్ర నేత వోరుగంటి రమణారావు, జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోళి శోభ–సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, విండో చైర్మన్లు కర్ర భాస్కర్ రెడ్డి, మంత్రి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

## బీజేపీకి షాక్

- పార్టీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ బీఆర్ఎస్‌లోకి
- వేములవాడలో మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక



శ్రీనివాస్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన వేములవాడ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు

బీజేపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ దళిత మోర్చా జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మొలిగె శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లికి చెందిన ఆయన, సోమవారం వేములవాడలో మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులయ్యే పార్టీలో చేరానని, వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలుపు కోసం కృషిచేస్తానని చెప్పారు. **- కథలాపూర్, అక్టోబర్ 16**



కోనాపూర్‌కు చెందిన కాంగ్రెస్‌నేత, మాజీ ఉప సర్పంచ్ తిరుపతిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

## సంక్షేమంలో మనకు సాటిలేదు

- మన పథకాలు దేశానికే ఆదర్శం
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్
- బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఆహ్వానం

కొడిమ్యాల, అక్టోబర్ 16: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, సంక్షేమంలో మనకు సాటి ఎవరూ రారని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఉద్ఘాటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే ప్రతిపక్షాల నాయకులు పార్టీలోకి క్యూ కడుతున్నారని చెప్పారు. సోమవారం కొడిమ్యాల మండలం కోనాపూర్‌కు చెందిన కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ ఏనుగు తిరుపతితో పాటు నాయకులు, బీజేపీ నాయకులు మొత్తం 30 మంది బీఆర్ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు. ప్రతిపక్షాల మాటలు నమ్మితే మోసపోతామన్నారు. చొప్పదండిలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని కార్యకర్తలకు సూచించారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సర్పంచ్ చెక్కపల్లి స్వామి రెడ్డి, నాయకులు లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో ప్రచారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి

- బ్యానర్లు, వాల్‌రైటింగ్‌లు తొలగించాలి
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 16 : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు కొనసాగుతున్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ప్రచారంపై దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి సూచించారు. సోమవాం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లు, కోడ్ అమలుకు చేపట్టాల్సిన చర్యలపై ఆర్వోలు, నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జనసమ్మర్థత ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, వాల్‌రైటింగ్‌లు ఉంటే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఇప్పటికి కూడా తొలగించకపోతే పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ 12బీ కోసం అవసరమైన శాఖలన్నింటినీ వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. సెక్టోరల్ అధికారులకు ఎన్నికల సామగ్రిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు అన్ని శాఖల్లోని ఒప్పదం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల వివరాలు పంపాలన్నారు. జిల్లాలోని యాభై శాతం పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామని, మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ, వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రాలను ఆర్వోలు ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు.

### ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఎన్నికల కోసం జిల్లాకు వచ్చే సాధారణ, వ్యయ పరిశీలకులు, పోలీసు పరిశీలకుల కోసం కావాల్సిన ఏర్పాట్లు ముందస్తుగా చేయాలన్నారు. నియోజకవర్గం వారీగా రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని, ఎన్నికల కోసం అవసరమయ్యే వాహనాలు ముందుగానే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం వారీగా దివ్యాంగుల కోసం రెండు వీల్ చైర్లు, ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేయాలని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వారిపై సత్వరమే ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలన్నారు. పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు మాట్లాడుతూ, అనుమతి పొందిన వాహనాల ద్వారా మాత్రమే ఎన్నికల ప్రచారం నిర్వహించేలా చూడాలని, రాజకీయ నాయకులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. నామినేషన్ వేసే విధానాన్ని వీడియో రికార్డింగ్ చేయాలని, నామినేషన్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రాజు, ఏసీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.2.36 కోట్లు స్వాధీనం



పట్టుబడిన నగదును చూపుతున్న సీపీ సుబ్బారాయుడు, ఆర్డీఓ మహేశ్వర్

రాంనగర్, అక్టోబర్ 16 : అసెంబ్లీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పోలీసుల తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఈ క్రమంలో సోమవారం టూటౌన్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా సరైన ఆధారాలు లేకుండా వ్యాన్‌లో తరలిస్తున్న రూ.2,36,48,494ల నగదును స్వాధీనం చేసుకున్నారు. రైటర్ సేఫ్‌గార్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన టీఎస్ 02 యూడీ 5198 నెంబర్ గల వాహనంలో ఈ నగదును స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో సీపీ సుబ్బారాయుడు, ఆర్డీవో మహేశ్వర్ లు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ నగదును తరలిస్తుండ గా వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకుని విచారించగా ఎలాంటి ఆధారాలూ వారి వద్ద లభ్యం కాకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. స్థానిక రిటర్నింగ్ అధికారి ఆదాయ పన్ను శాఖకు సమాచారం అందించినట్లు చెప్పారు. తదుపరి చర్యల కోసం జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.2,84,67,452 పట్టుబడిందని, ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టామని స్పష్టం చేశారు. పెద్ద మొత్తంలో నగదు పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ రాంచందర్‌రావు, ఎస్ఐ సీనా నాయక్, సిబ్బంది శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, రవీందర్, మల్లయ్యను సీపీ అభినందించారు. సీపీ వెంట స్థానిక రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మహేశ్వర్, టౌన్ ఏసీపీ నరేందర్ పాల్గొన్నారు.

### రాజీవ్‌చౌక్‌లో రూ.3.30 లక్షలు సీజ్

కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌లో వాహన తనిఖీలు చేపట్టగా ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ఆధారాలూ లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరి వద్ద రూ.2.50 లక్షలు, మరొకరికి వద్ద రూ.81,350 స్వాధీనం చేసుకుని నగదుతో సహా వారిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

## పసుపు కొమ్ముపై అమ్మవారి ప్రతిమ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 16: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అద్భుతం సృష్టించాడు. దుర్గామాతకు ఇష్టమైన పసుపు కొమ్ముపై అమ్మవారి విగ్రహాన్ని చెక్కాడు. కాగా, దయాకర్ ఇంతకుముందు దేశ నాయకుల, దేవతల విగ్రహాలను తయారు చేసి గుండుసూది మొనపై, గుండుసూది బెత్తంలో నిలబెట్టి ఎందరో ప్రశంసలందుకున్నాడు.



సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్, ఇన్‌సెట్లో ప్రతిమ